# సాయి తత్త్వాన్ని మీరు చక్కగా అర్థం చేసుకోండి!

sri sathyasai vachanamrutam

శాస్త్రజాలంబునంతయు చదువగానె
దట్టమైనట్టి అజ్ఞానతమము తెగునె
ఆచరణ లేని విద్యలు అవనియందు
నిండివుండియుఫలమేమి గుండుసున్న
  బ్రహ్మ దర్శన భాగ్యంబు బడయగోరి
  వెతకబోవుదు వెచటికె వెఱ్ఱిమనస
  అదియు నీలోన నున్నది అరుగుమచట
  సత్యమును తెల్పుమాట యీ సాయిమాట

దివ్యాత్మ స్వరూపులారా!

వేదము ధర్మమూలము. వేదము యజ్ఞరూపమున సాక్షాత్కరించుచున్నది. యజ్ఞసిద్ధియే వేదముయొక్క లక్ష్యము. యజ్ఞమునకు ఆధారము, వేదము. సమస్త యజ్ఞములుకూడను యజుర్వేదమునుండి ఆవిర్భవిస్తూ వచ్చాయి. 'యజ్' అనే ధాతువుకు దైవపూజ, దానము అని అర్థము. ఈ ధాతువునుండి వచ్చిన శబ్ధములే యజుర్వేదము. యజ్ఞయాగాది కర్మకాండలయందు అనేక విధములుగా పరిశీలన జరిపి లోకమునకు కళ్యాణముగావించే నిమిత్తమై ఆవిర్భవింపచేసినది, యజుర్వేదము. ఈ యజ్ఞములు యెప్పుడు చేయవలెను, వీటికి సమయము యెట్టిది అనే కాలజ్ఞానము నిర్మించే నిమిత్తమై యజుర్వేదము మొట్టమొదట జ్యోతిషశాస్త్రమును అందించింది. కాలజ్ఞానమును నిరూపించేది జ్యోతిషశాస్త్రము. యజ్ఞవేదికపైన హోమగుండమును యే విధముగా నిర్మించాలి, ఏ విధమైన పదార్థముతో నిర్మించాలి అనే విచారణను పురస్కరించుకొని మొట్టమొదట దీనికి ఒక విధమైన శాస్త్రమును నిర్మింపచేసింది. అదియే వాస్తుశాస్త్రము. మంత్ర శబ్దములను

సరైన స్థితిలో వుచ్చరింపచేసే నిమిత్తమై వ్యాకరణశాస్త్రమునుకూడను నిర్మించింది. ఈ విధంగా యజుర్వేదము జ్యోతిషశాస్త్రము, వాస్తుశాస్త్రము, వ్యాకరణశాస్త్రములను కల్పించినది. తదుపరి ప్రధానమైన యజ్ఞములను మూడింటిని సంకల్పించుకొని నిర్మించినది.

## గృహస్థులు, శాస్త్రజ్ఞానములేని సామాన్యప్రజలు ఆచరించదగిన పంచయజ్ఞములు

హవిర్ యజ్ఞము, సోమయజ్ఞము, పాకయజ్ఞము అని యీ మూడు ప్రధానమైనవి. శాస్త్రసంపన్నులైన, వేదాసక్తి కల్గిన, వేదాధ్యయనం చేయగల్గిన విప్రులు మాత్రమే యీ యజ్ఞములు ఆచరించ అర్హులు. కాని, యింతటితో తృప్తిపడక సామాన్య గృహస్థులు, వేదమును గుర్తించలేని ప్రజలు, శాస్త్రమునెరుగని ప్రజలు నిత్యజీవితములో ఆచరించగలిగే మరికొన్ని యజ్ఞములనుకూడను నిర్మించింది. వీటినే దేవయజ్ఞమని, ఋషియజ్ఞమని, పితృయజ్ఞమని, మనుష్యయజ్ఞమని, భూతయజ్ఞమని పంచయజ్ఞములను నియమించింది.

## భగవంతునికి కృతజ్ఞతాపూర్వకముగా చేసే ప్రార్థనలే దేవయజ్ఞము

దేవయజ్ఞమనగా యేమిటి? ఇది సామాన్యులు ఆచరించటానికి అనుకూలమైనది. దీనికి యెట్టి యజ్ఞ వేదికలు నిర్మించనక్కరలేదు. ఎట్టి శాస్త్రములుకూడను వల్లించనక్కరలేదు. ఎట్టి వేదములుకూడను వల్లెవేయనక్కరలేదు. ఇంక యే విధముగా యీ యజ్ఞమునాచరించటము? భగవంతుడు మానుష దేహమందు ప్రతి అణువునందు, కణమునందు అంతరరూపుడై నివసిస్తున్నాడు. ఇలాంటి పరమాత్ముడు రసస్వరూపుడై ప్రతి అంగమునందు సంచరిస్తూ వున్నాడు. జాగ్రత్ స్వప్నసుషుప్తులయందు యీ దేహమును కాపాడుతూ పోషిస్తూ వస్తున్నాడు. ఆ విధంగా రక్షించిన భగవంతుని కృతజ్ఞతాపూర్వకముగా స్మరించి, పూజించి, గౌరవించటమే దేవయజ్ఞముగా భావించారు. లోకములో ఎవరు యే చిన్న సహాయము చేసినప్పటికి వారికి యనేక విధములుగా కృతజ్ఞత తెలుపుతూ స్మరిస్తూ వుండటం మనం చూస్తుంటాము. ఈ ఆధునిక యుగములో మన టవల్ క్రింద పడితే యెవరైనా అందిస్తే Thanks అని కృతజ్ఞతాపూర్వకముగా చెబుతాము. అటువంటిది మన జీవితమునే రక్షించి, అభివృద్ధి గావించి, పోషించిన భగవంతునికి



sri sathyasai vahini

కృతజ్ఞత చెప్పనక్కరలేదా? అట్టి కృతజ్ఞతాపూర్వకమైన ప్రార్థనలే యీ యజ్ఞములు. భగవంతుని ప్రార్థన చేయుటకు ధనముగాని, యింకే విధమైన స్థలముగాని వుండనక్కరలేదు. హృదయపూర్వకముగా ఆయనకు కృతజ్ఞతనందించే, పవిత్రమైన త్రికరణ శుద్ధితో పూజించే పూజలే దేవ యజ్ఞములు.

**మానవుడు నిత్యజీవితంలో ఆచరించే కర్మలు ఏ విధంగా ఉండాలి అనే శాస్త్రములను నిర్దేశించిన ఋషులకు కృతజ్ఞత తెలుపడం ఋషియజ్ఞము**

ఋషియజ్ఞము. మానవుడు యీ జగత్తునందు యే విధమైన లక్ష్యముతో ఏ విధమైన మార్గములో ప్రవేశించి తన కార్యకలాపములను నిర్వర్తించుకొనవలెనని ఋషులే అనేక విధములైన శాసనములు అందిస్తూ వచ్చారు. మానవ జీవితములో తెల్లవారినది మొదలు రాత్రి పరుండునంతవరకు అనేక విధములైన కర్మలలో మనము పాల్గొనుచూ వుంటాము. ఏ కర్మ యేవిధమైన మార్గములో, యెప్పుడు, యెక్కడ చేయాలి అనేది ఋషులు అందించిన శాసనములలో నిర్దేశింపబడింది. మానవుడు ఈ జగత్తునందు సుఖశాంతులతో జీవించటానికి ఆధారభూతమైన శాసనములు అందించినవారు, మహర్షులు. ఆదర్శప్రాయమైన జీవితానికి కొన్ని విధములైన ఉత్సాహప్రోత్సాహములు అందించినవారు. వారు ఆచరించి, అనుభవించి, అందించిన సుధానిధులు, యీ శాస్త్రములు. శాస్త్రసమ్మతమైన కర్మలను ఆచరించుకుంటూ, శాస్త్రమును నిర్మించిన ఋషులకు కృతజ్ఞతాపూర్వకముగా నమస్కరిస్తూ, గౌరవించుకుంటూ పోవటమే ఋషిఋణము. ఇదియే ఋషియజ్ఞము.

**జన్మనిచ్చి, పెంచిపోషించి తమ జీవితాలను తీర్చిదిద్దిన తల్లిదండ్రులను కృతజ్ఞతాపూర్వకంగా స్మరిస్తూ ఆచరించే కర్మలే పితృయజ్ఞము**

పితృయజ్ఞము. మన జీవితమునకు, మన దేహమునకు మూలకారకులు, మాతాపితరులే. మన దేహము, దేహమునందు ప్రవహించే రక్తము, సర్వస్వము తల్లితండ్రులయొక్క ప్రసాదమే! తమ బిడ్డల అభివృద్ధి నిమిత్తమై తల్లితండ్రులు అనేక విధములైన శ్రమలకోర్చి, పస్తుండి, తమ పిల్లలను పోషించే మహాపవిత్రులు. తమ పిల్లలు

యెట్టి కష్టములకు, దుఃఖములకు, విచారములకు గురికాకూడదని, అనేక విధములైన వస్తువాహనములను ప్రోగుచేసి అందించి వారి భవిష్యత్తు ఆనందముగా గడవాలని ఆశించేవారు, తల్లితండ్రులు. అటువంటి పూజనీయులైన తల్లితండ్రులను గౌరవించి, వారిని ప్రసన్నులు గావించి, సేవించి, జీవితకాలమంతయు వారి ఆజ్ఞను శిరసావహించి, చివరకు తల్లితండ్రులు గతించిన తరువాత వారి జ్ఞాపకార్థమై సత్కర్మలాచరించి, దాన ధర్మాదులు జరిపి, వారి ప్రీత్యర్థమై ప్రతి సంవత్సరము లేక నెలకొక పర్యాయము వారికి తర్పణము గావించి, ప్రేమపూర్వకముగా వారిని స్మరించటమే పితృయజ్ఞము.

**ఇతరుల కష్టసుఖములలో పాలు పంచుకుని సమాజసేవలో పాల్గొనడమే మనుష్యయజ్ఞము**

ఇక మనుష్యయజ్ఞము. తోటిమానవుడు కష్టములకు, దుఃఖములకు గురౌతున్న సమయంలో వారికి తగినంత సహాయంచేయడం, దీనుల దుఃఖము రూపుమాపుటకై దాన ధర్మములు చేయడం, రోగులకు సేవలు చేయడం, సమాజసేవలో పాల్గొనడం, ఇతరులను ఆనందపెట్టి తాను ఆనందపడటమే మనుష్యయజ్ఞము. ఇంతేకాక, యింటికి యేతెంచిన అతిథి, అభ్యాగతులనాదరించి, మానవులందరుకూడను ఒకే జాతికి సంబంధించిన వారని గుర్తించి, నా కష్టములవంటివే అతని కష్టములు, నా సంతోషమువంటిదే అతని సంతోషము అని సమత్వాన్ని భావించి పరులసేవలో పాల్గొనటమే మనుష్యయజ్ఞము.

**సర్వభూత స్వరూపుడే భగవంతుడని భావించి భూతతృప్తిని గావించటం, భూతయజ్ఞము**

చివరిది, భూతయజ్ఞము. సామాన్యముగా ప్రతిమానవుడు తన యింటియందు పశువులు, కుక్కలు, పిల్లులువంటి జంతువులు, పక్షులు, మొదలగు జీవులను పెంచడం చూస్తూవుంటాము. ఈ జీవులపైన ప్రీతిని చూపి, సకాలములో వాటికి ఆహారమునందించి, సర్వభూతములయందు ప్రేమను పెంచుకొని, సర్వభూతస్వరూపుడే భగవంతుడని విశ్వసించి, యిలాంటి నోరులేని పశువులను, పక్షులను, మృగములను ఆదరించి పోషించటానికి కృషి చేయటము భూతయజ్ఞము. పూర్వకాలములో స్త్రీలు ప్రతిదినము యింటిముందు పేడ నీళ్లను చల్లి, శుభ్రపరచి, అందముగా ముగ్గులు అలంకరించేవారు. అయితే, యీ ముగ్గులు యే విధమైన పదార్థముతో అల్లేటువంటివారు? బియ్యపుపిండిని



sri sathyasai vahini vachanamrutam

ముగ్గులక్రిందవేసి అందముగా అలంకారముగా వుండేటట్లుగా, గృహమునకు కళ్యాణకరముగా వుండినట్లు భావించేవారు. ఇందులోనే భూతదయ యిమిడి వుంటున్నది. ఆ బియ్యపుపిండి నిమిత్తమై యనేక చీమలు రావటం, దోమలు రావటం, పక్షులు రావటం ఆ బియ్యపు పిండిని భుజించి భూత తృప్తిని పొందటం యీ విధముగా జరుగుతూ వుండేది. కానీ యీనాడు కలియుగ ప్రభావముచేత బియ్యపుపిండి పోయింది. సున్నపుపిండి వేయటంచేత చీమలు రావటంలేదు. భూతతృప్తి కలగటంలేదు.

ప్రాచీనకాలమునుండి వేదప్రమాణమును పురస్కరించుకొని నిత్యజీవితంలో సామాన్య మానవుడు యే చిన్న కార్యమునందుకూడను ఒక విధమైన త్యాగభావముతో అనుసరించే కర్మలే యీ వేద కర్మలు. ఈ విధముగా ఐదు విధములైన యజ్ఞములు. వేదశాస్త్రములు తెలియని మూర్ఖుడైనప్పటికిని, పామరుడైనప్పటికిని, నిత్యజీవితములో యీ పవిత్రమైన కర్మలాచరించి యివియే సరైన యజ్ఞములుగా విశ్వసించటము ప్రతివ్యక్తికి అత్యవసరము.

విప్రులకు సంబంధించిన యజ్ఞములు మూడును పూర్వమే చెప్పాను. ఇంక సామాన్యమైన మానవులాచరించే యజ్ఞములు ఐదు యజ్ఞములు. ఇవికూడను మనము తెలుసుకున్నాము. అయితే శ్రీమంతులు, ధనవంతులు, చక్రవర్తులు వీరంతా ఆచరించే యజ్ఞములను ప్రత్యేకముగా నియమిస్తూ వచ్చింది, యజుర్వేదము. ఇవియే రాజసూయయాగము, అశ్వమేధయాగము, సర్వమేధ యాగము. ఈ మూడుకూడను గొప్ప ధనవంతులు ఆచరించేవి.

అశ్వమేధయాగమంటే వేదసమ్మతమైన, వేదము వర్ణించిన లక్షణములుగల పంచకళ్యాణి గుఱ్ఱమును తీసుకొనివచ్చి, అలంకరించి యేదో కొన్ని విధములైన నిబంధనలు దానిపైన నియమించి అశ్వమును వదలటమనేదికాదు. దీని అంతరార్థమునుకూడను బోధించినది, యజుర్వేదము. అశ్వమనగా యేమంటే నిరంతరము చలించేది. మీరు చూచే వుంటారు. గుఱ్ఱము యెప్పుడుకూడను యేదో ఒక అవయవమును తాను ఆడిస్తూనే వుంటుంది. కాలు, తోక, చెవి, మూతి, ఇలా ఏదో ఒక అవయవమును యెప్పుడూ కదలిస్తూనే వుంటుంది. నిరంతరము చంచలత్వాన్ని అనుభవించేదే అశ్వము. అశ్వత్థ

sri sathyasai vacahamrutam

వృక్షమును మీరు చూచే వుంటారు. ఈ అశ్వత్థమంటే అర్థమేమిటి? గాలిలేకపోయినా ఆకులు ఆడుతూనే వుంటాయి. అనగా నిరంతరము కదలే తత్త్వమునకు అశ్వమని పేరు. మేధ. యీ బుద్ధికూడను అలాంటిదే! ఇది యెప్పుడు చూచినా నిద్ర వచ్చేంతవరకు ఆడుతూనే వుంటుంది. 'సంకల్పవికల్పకాత్మకం మనః'. నిరంతరము యేదో ఒక సంకల్పం, వికల్పం. యీ విధమైన చంచలత్వముతోకూడి వుంటుంది. ఈ చంచలమైన మనసును అరికట్టేదే అశ్వమేధయాగము అన్నారు. అయితే అంత మాత్రముతోనే తృప్తిపడక శ్రీమంతులైన వారు, చక్రవర్తులైన వారు, రాజులు, రారాజులుకూడను దానిని ఆడంబరముగా సల్పి అనేక విధములుగా యుద్ధములలో పాల్గొని తమకంటే అధికులైనవారిని హతమార్చి తాము ఏకచ్ఛత్రాధిపత్యాన్ని యేలాలని యీ రకమైన యాగములు చేస్తూ వచ్చారు.

**వైదిక కర్మలు నిర్వర్తించడానికి, ఎట్టి చిన్న కార్యములైనా, కొన్ని అర్హతలు ఉండాలి**

రాజసూయయాగము. ఇది అందరు చేయతగినదికాదు. ధర్మరాజు యీ రాజసూయయాగం చేయాలని సంకల్పించుకున్నాడు. ఈ విషయం కృష్ణునకు తెలిసింది. తక్షణమే కృష్ణుడు వచ్చి "బావా! దీనిని నీవు చేయతగినదికాదు. నీకు చేయుటకు అధికారము లేద"ని ఖండితముగా చెప్పాడు. అందుకు కారణము "నీ కంటే బలిష్టులైనవారు యింకా కొంతమంది రాజులుంటున్నారు-శిశుపాలుడు, దంతవక్త్రుడు, జరాసంధుడు. ఇలాంటి అధికబలము కల్గిన రాజులను రాజ్యములో వుంచుకొని రాజసూయయాగము చేయుటకు నీకు యేమాత్రము అధికారంలేద"న్నాడు. "ఈ రాజసూయయాగము చేయతలచుకొంటివా యీ ముగ్గురిని జయించు. అప్పుడే నీవు ఏకచ్ఛత్రాధిపత్యం వహించినవాడవౌతావు. నీకు మించిన రాజులు నీ రాజ్యములో మరెవరూ వుండరు. అప్పుడే నీవు యీ రాజసూయయాగం చేయటానికి అధికారి"వని బోధించి, యుద్ధము చేయించి, దుష్టులను హతమార్చిన తదుపరి యీ రాజసూయయాగం చేయించాడు. కనుకనే యెట్టి చిన్న యజ్ఞమునకైనా, యాగమునకైనా, పనులకైనాకూడను కొన్ని అర్హతలను కల్గివుండాలి.

యజుర్వేదమునకు రెండు విధములైన సంస్కారములుంటున్నాయి. బ్రహ్మసంస్కారమని

sri sathyasai vahini amrutam

ఒకటి, ఆదిత్యసంస్కారమని మరొకటి. బ్రహ్మసంస్కారమంటే యేమిటి? వేదములను విభజించి, జగత్తునకు చాటినవాడు, వ్యాసుడు. అతనికి ప్రధాన శిష్యుడు వైశంపాయనుడు. అతను వ్యాసుని దగ్గరనుండి యనేక విధములైన శాస్త్రములను, వేదములను రహస్యములనుకూడను నేర్చుకున్నవాడు. అతని దగ్గర యాజ్ఞవల్క్యుడు ప్రవేశించాడు. యాజ్ఞవల్క్యుడు గొప్ప మేధాశక్తి కల్గినవాడు. అతను వేదములను అధ్యయనం చేసే నిమిత్తమై తన ప్రాణముసైనను అర్పితము గావించటానికి సంసిద్ధుడైనవాడు. వైశంపాయనుడు యీ యాజ్ఞవల్క్యుని చూచిన తక్షణమే పట్టలేని ఆనందముతో పొంగిపోయాడు. అతనిని దగ్గరచేర్చి, కన్నబిడ్డవలె ఆదరించి, పోషించి, వేదమునందలి రహస్యములన్నింటినికూడను బోధించాడు.

## ప్రతి మానవునియందు కొన్ని పాత సంస్కారములు ఉంటాయి

సామాన్యముగా ప్రతి మానవునియందు కొన్ని పాత సంస్కారాలు వుంటాయి, ఈ సంస్కారములు యాజ్ఞవల్క్యునిలోకూడ ప్రవేశించాయి. తాను వేదాధ్యయనంచేసి, సర్వ రహస్యములు గుర్తించి కూడను, కొంతకాలమైన తర్వాత అతనిలో కొంత అహంకారము ప్రారంభమైంది. తత్ఫలితంగా గురుభావమనేది క్రమక్రమేణా సన్నగిల్లుతూ వచ్చింది. కొన్ని విషయాలలోపల గురువునకు, శిష్యునకు కొన్ని అభిప్రాయభేదములుకూడా వచ్చాయి. క్రమక్రమేణా గురువుతో వాదనకు పూనుకున్నాడు. దీనిని గుర్తించిన వైశంపాయనుడు "నాయనా! చాలు. నీకు, నాకు యీనాటితో ఋణం తీరిపోయింది. మనమధ్య ప్రేమబంధం వుండినంతవరకు నేను నిన్ను యెన్ని విధములుగనో ఆదరించాను. పుత్రసమానముగా చూచుకున్నాను. ఎవరికీ చెప్పని రహస్యాలను నీకు చెప్పాను. ఇంక నీవు నా వద్ద వుండి ప్రయోజనములేదు. కనుక, నేను బోధించిన విద్యలు నాకు అప్ప జెప్పి నీవు వెళ్లిపో"మని చెప్పాడు. తానుకూడ పట్టుదల గల్గినవాడు కనుక, యాజ్ఞవల్క్యుడు తాను అధ్యయనం చేసిన వేదమును వమనము చేసి వెళ్లిపోయాడు. ఈ వమనము చేసిన వేదమును తిత్తిరిపక్షులు గ్రహించాయి. అవి వాటిని ఉచ్చరిస్తూ వచ్చాయి. ఇంతేకాక తిత్తిరీ అనే ఋషికుమారుడుకూడ వుండటంచేత ఆ తిత్తిరీ కుమారునియొక్క ప్రచారప్రబోధలచేత దీనికి 'తైత్తిరీ' అని పేరు వచ్చింది. తిత్తిరీ పక్షులు గ్రహించటంచేత దీనికి కృష్ణ యజుర్వేదము అని

sri sathyasai vachanamrutam

పేరు వచ్చింది. ఈ తిత్తిరీయజుర్వేదము, బ్రహ్మ సంస్కారము.

యాజ్ఞవల్క్యుడు ఆ క్షణమునందు ఆవేశముతో తాను ఆ విధంగా ప్రవర్తించాడే కాని, తదుపరి గురువుకు దూరమైపోయి మహా భయంకరమైన తాపము ననుభవిస్తూ వచ్చాడు. ఆకలితో మాడినాడు. తాను వదలినటువంటి వేదములను తిరిగి తాను అనుభవించాలనే దీక్షతో అనేక విధములుగా తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి ఆదిత్యుడు ప్రత్యక్షమయ్యాడు. ఏ విధముగా ప్రత్యక్షమయ్యాడు? సాక్షాత్తుగా కాదు, వాయురూపంలో ప్రత్యక్షమయ్యాడు. యాజ్ఞవల్క్యుడు సంతోషించి యెదురైన ఆ మూర్తికి నమస్కరించాడు. 'నాయనా! నీకేమి కావాల'ని ప్రశ్నించాడు, ఆదిత్యుడు. 'తాను పోగొట్టుకున్న ఆ పవిత్రమైన ప్రాప్తిని తిరిగి అందించమ'ని ప్రార్థించాడు, యాజ్ఞవల్క్యుడు. అందుకు ఆ మూర్తి "కుమారా! ప్రవహించినటువంటి నదీజలము, నరుని యవ్వనము, దైవానుగ్రహము యివి వెనుకకు రావటానికి వీలులేదు. ఒక్కతూరి నదీ జలము ప్రవహించి పోయినదా, తిరిగి వెనుకకురాదు. ఒక్కతూరి నీ యవ్వనం క్షీణించెనా, తిరిగి ప్రాప్తించదు. ప్రయోజనమేమిటి? కార్యమునకు పూర్వమే నీవు చింతించవలెను గాని, కార్యము తదుపరి చింతించి ప్రయోజనములేదు" అని బోధించాడు. గురు శిష్యులు నాడును నేడును ఆ విధమైన పరిస్థితిని అనుభవిస్తూ వస్తున్నారు. ఆనాటి గురువులు తమ వాక్యముయొక్క విలువను రక్షించుకొనుటకై అనేక విధములైన ప్రయత్నములు చేస్తూవచ్చారు.

**'స్వామికి నిండు ప్రేమ వున్నది'**

ఈనాటి శిష్యులలో వాగ్దానములకుగాని, మాటలకుకాని విలువలేకుండా పోతున్నాది. కాని, దైవత్వముతో కూడిన గురువులకు భగవంతుని వాక్కే ప్రధానము. తమ వాక్కుకు యేమాత్రం విలువలేకుండా చేసుకోటానికి వారు అంగీకరించరు. మీకందరికి తెలుసు, నేను అనేక మందిని అనేక విధములుగా అభివృద్ధి పరచి, సరైన మార్గములో ప్రవేశపెట్టి, వారి ఆదర్శమును జగత్తుకు అందించే నిమిత్తమై అనేక విధములుగా బోధిస్తూ వుంటాను. కాని, తుచ్ఛమైన, క్షణికమైన, లోకభ్రాంతులకు లొంగి వారు యీ వాక్యములను వుల్లంఘించి ప్రవర్తిస్తూవుంటారు. ఒకతూరికాదు, రెండు మూడు తూర్లుకాదు, వందల

sri sathyasai vahini amrutam

పర్యాయములు వారికి చెపుతూ వస్తుంటాను. వారు దానిని అనుసరించకుండా పోవటంచేత వారితో నేను మాట్లాడటంకూడా మాని వేస్తూవుంటాను. అంత మాత్రముచేత వారిపై ద్వేషమా లేక కోపమా? కాదుకాదు. స్వామికి నిండు ప్రేమ వున్నది. ద్వేషములేదు, ఆగ్రహములేదు. యేమాత్రములేదు. అనుగ్రహమే వున్నది. కారణమేమిటి? నా మాటకు విలువను పోగొట్టుకోటం నా కిష్టంలేదు. ఆ వుద్దేశ్యముతోనే వారితో నేను మాట్లాడను. స్వామి మాట్లాడటంలేదుకదా అని వారు విచారపడతారే కాని, ఆయన మాటకు విలువను నేనిచ్చానా అనే విషయాన్ని వారు విచారించరు. ఇదియే భగవంతునికి, భక్తునికి వుండిన తేడా! భక్తులలో అనేక విధములైన సంస్కారములు, జన్మజన్మలనుండి ప్రాప్తించిన దుష్టసంస్కారములు, దురభ్యాసములు తోడుగా వస్తుంటాయి.

**మర్కటంబుమెడకు మల్లెమాలలువేసి**
**పట్టుపీతాంబరములు పదిలపరచి**
**రత్నసింహాసనమున రమ్యంబుగా జేర్చిన**
**వీడునా తన జాతి వక్రబుద్ధి**

కోతికి యిన్ని మాలలువేసి, యిన్ని విధములైన అలంకారములు చేసి పెద్ద రత్న సింహాసనముపైన కూరోపెట్టినాకాని, తనయొక్క పాతవాసనలంతా మానుతుందా? తన కోతిబుద్ధులు వదులుతుందా? వదలదు. కనుక ఆ విధముగాకూడను యీ పాతవాసనలు వారికి, యెన్ని విధములైన మేలు చేసినా, ఉపకారముచేసినా వారికి ప్రబోధలు సలిపినా యివి యేమాత్రం నిలచకుండా పోతుంటాయి.

**పచ్చకప్పురపు మడిని పాదుచేసి**
**కమ్మకస్తూరి యెరువుగా కుమ్మరించి**
**మంచి పన్నీరు పోయుచు పెంచిచూడ**
**ఉజ్జగించునే తన కంపు వుల్లిపాయ**

మట్టికైనా కర్పూరం వాసన వస్తుందిగాని, కస్తూరి వాసన వస్తుంది గాని, పన్నీరు వాసన వస్తుంది గాని, ఉల్లిపాయకు రాదు. ఇటువంటి వుల్లిపాయ సంతతివారు, మర్కటపు

sri sathyasai vachanamrutam

సంతతివారు యీ విధమైన అమూల్యమైన, పవిత్రమైన మాటలను గ్రహించుకోలేకపోతున్నారు.

అయితే వీరివలెకాక ఆనాడు యాజ్ఞవల్క్యుడు పశ్చాత్తాపపడుతూ వచ్చాడు. ఈనాటి మానవులకు పశ్చాత్తాపంకూడాలేదు. ఇంకా తమ దోషములను కప్పిపుచ్చుకునే నిమిత్తమై భగవంతునిపై అపవాదులు వేయటానికి సిద్ధంగా వుంటారు. తమ దోషములనేమాత్రం గుర్తించటానికి ప్రయత్నించరు. వీరు మర్కటముకంటే హీనులు, యాజ్ఞవల్క్యుడు తాను చేసిన తప్పునకు చాలా పరితపిస్తూ ఒక విధమైన తపస్సుగా మార్చుకున్నాడు. కనుకనే ఆదిత్యుడు వచ్చి, ఆ తపస్సుకు మెచ్చి, తిరిగి వైశంపాయనుడు అందించిన ఆ వేదములను ఆదిత్యుడే స్వయముగా అతనికి అందిస్తాడు. ఇదియే 'ఆదిత్య సాంప్రదాయము' అన్నారు. దీనినే శుక్లయజుర్వేదము అన్నారు.

**సర్వోపనిషత్సారము ఈశావాస్యోపనిషత్తులో ఉన్నది**

శుక్ల యజుర్వేదము ఉత్తర భారతమునందు, కృష్ణ యజుర్వేదము దక్షిణ భారతమునందు అభివృద్ధి గాంచుతూ వచ్చాయి. యీ వేదములకు పేర్లు విరుద్ధముగా వున్నవి కాని, రెండింటియందు వున్న భావములు ఒక్కటే! అయితే యీ వేదములయొక్క ప్రమాణములను గుర్తించి వర్తించటానికి దీనియందుగల రహస్యాలను కొన్నిటిని గుర్తించాలి. ఈ యజుర్వేదములోపల అంత్యశ్లోకమునందు ఉపనిషత్తులు అనే పేరుతో ఈశావాస్యోపనిషత్తును వర్ణించింది. దీనియందు మొట్టమొదటి వాక్యము 'ఈశావాస్యమిదంసర్వమ్'. కనుక, దీనికి 'ఈశావాస్యోపనిషత్తు' అని పేరు పెట్టారు. ఉపనిషత్తులన్నింటికంటెను ఈశావాస్యోపనిషత్తు మిగుల వున్నతమైనది, పవిత్రమైనది. సర్వోపనిషత్ సారము ఈశావాస్యోపనిషత్తులో వుంటుండాది. దీనియొక్క అంతరార్థమేమిటి? ప్రపంచమంతయు ఒకటే శక్తి వ్యాపించియున్నది. ప్రపంచమంతయు ఒకే ఆత్మ. ప్రతి జీవునియందు వుండినది దేవుడే! తాను లేని స్థానముకాని, తనది కాని పేరుకాని జగత్తునందు లేదని వర్ణించింది. కనుకనే, 'యెవరిని నొప్పించినా దైవాన్ని నొప్పించినవారే! ఎవరిని మెప్పించినా దైవాన్ని మెప్పించినవారే!' అనే సత్యాన్ని గుర్తించారు.

sri sathyasai vahini vachanamrutam

నిరంతరము యీ శ్లోకాన్ని పఠించేవాడు యాజ్ఞవల్క్యుడు. అహింస పరమధర్మమని, యెవరిని హింసించకూడదని వ్రతాన్ని పూనుతూవచ్చాడు.

**తెలిసి మనోవాక్కాయములతో ఎవరిని హింసించకుండా ఉండటమే అహింస**

అహింస అంటే యేమిటి? ఎవరిని హింసించకుండా వుండటమా? ఇది సాధ్యమా? ఇది అసాధ్యము. జీవితములో మనము చేసే ప్రతి చిన్న పనియందుకూడను ఎంతోకొంత హింస ఇమిడియుంటుంది. మనము నడచే నడకలోపల యెన్నో ప్రాణులు మరణిస్తూవున్నాయి. మన యింటిని వూడుస్తూ వుంటుంటే యెన్నో చీమలు చచ్చిపోతుంటాయి. మనము స్నానము చేస్తుంటే యెన్నో పురుగులు అంతా మరణిస్తున్నాయి. మనము వంటలు చేస్తుంటే అందులో యెన్నో క్రిములు భస్మమైపోతున్నాయి. అంతవరకు మనము పోనక్కరలేదు. మన ఉచ్ఛ్వాసనిశ్వాసములలోనే కొన్ని లక్షల ప్రాణులంతా మరణిస్తున్నాయి. కాబట్టి, అహింస అనగా దీని తత్త్వమేమిటి? 'తెలిసి మనోవాక్కాయములతో యెవరిని హింసించకుండా వుండటమే అహింస', అన్నారు. తెలియకుండా మనము యెన్నియో చేయవచ్చును. దీనికి మనం బాధ్యులముకాదు. అందువల్లనే త్యాగరాజు 'తెలిసి రామ చింతన చేయవే మనసా' అన్నాడు. తెల్సిచేయాలి కాని, తెలియకుండా చేసినవి యే మాత్రము మనను బంధించలేవు. ఏ మాత్రము దానియొక్క బాధలు మనకంటవు.

మనము తెల్సి యే పాపము చేయరాదు. ఈ చేయటమంటే కేవలం చేతులతో చేయటం మాత్రమేకాదు. మనసులోకూడను చింతించరాదు. మనసులో చింతించక పోవటమే కాదు, నోటితోకూడను వుచ్చరించరాదు. మనసును, వాక్కును, కాయమును పరిశుద్ధము గావించుకొని పరులను హింసించకుండా, బాధించకుండా, నొప్పించకుండా వుండటమే అహింస అనే పదమునకు సరైన అర్థము.

**బ్రహ్మను గుర్తిస్తే తానే బ్రహ్మగా మారిపోతాడు**

ఉపనిషత్తులు వేదములు భగవంతుడు సర్వవ్యాపకుడు, సర్వ భూతాంతరాత్మ అనే సత్యాన్ని ప్రకటించే నిమిత్తమై యిన్నిరకములైన కార్యకలాపములు అభివృద్ధి గావించుకుంటూ వచ్చాయి. ఎన్ని మంత్రములు చెప్పి యేమి ప్రయోజనము? ఆ

srisathyasaivachanamrutam

మంత్రములో వున్న సారమును గ్రోలాలి. వేదమంత్రములయొక్క వినికిడిచేత యెంతయో పవిత్రమైన ఆనందాన్ని మనం అనుభవించగలము. వేదశబ్దములోనే ఆ మాధుర్యము వుంటున్నాది. కనుకనే వేదము ప్రతి ఒక్కరికి ప్రాణసమానము. మంత్రములు తెలియకుండా పోయినంతమాత్రమున వేదము లేదని భావించరాదు. నీ ఉచ్ఛ్వాసనిశ్వాసములే వేదముగా భావించుకొని జీవిస్తూరావాలి. పీల్చుకునే గాలి 'సో'.... వదలే గాలి 'హం'. 'సో...హం'. ఈ ఉచ్ఛ్వాసనిశ్వాసములు యెంత పవిత్రమైన అర్థాన్ని మనకు ప్రబోధిస్తున్నాయి! 'సో' తను, అదే దైవము, 'హం' నేను. 'సో' అనగా దేవుడు. 'హం' నేను అనగా 'నేనే దేవుడు', 'నేనే దేవుడు', అనే భావములో తాదాత్మ్యభావము పొంది చివరకు తానే దేవుడుగా మారిపోతాడు. దీనినే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అన్నారు. బ్రహ్మను తెలుసుకోటానికి బ్రహ్మయొక్క తత్త్వాన్ని గుర్తించాలి. బ్రహ్మను గుర్తిస్తే తానే బ్రహ్మగా మారిపోతాడు. కనుక, ఈ ఉచ్ఛ్వాసనిశ్వాసములే ఒక ఉపదేశమంత్రముగా భావించి విడిచే గాలి, తీసుకునే గాలి ఈ రెండూ మీయొక్క యథార్థస్వరూపాన్ని నిరూపించేవే అనే సత్యాన్ని మీరు గుర్తించాలి.

**మొట్టమొదట తానే దైవమని గుర్తించడానికి తగిన సాధనలు చెయ్యాలి**

అట్లుకాకుండా ఎవరో గురువు అనుగ్రహించాడని చెప్పి మనం 'ఓంనమఃశివాయ' వంటి ఎన్నో మంత్రాలు జపం చేస్తుంటాము. కానీ వాటి ఫలితమేమిటి? ఒక పరమభక్తుడు 'శివోహం', 'శివోహం' అనే మంత్రమును గురువు దగ్గర అందుకున్నాడు. నిరంతరం 'శివోహం', 'శివోహం' అని మంత్రజపం చేస్తూ వచ్చాడు. ఇది చాలా పవిత్రమైన మంత్రమే! దీని అర్థాన్ని గుర్తించి వర్తిస్తే తానే శివునిగా మారిపోతాడు! ఎవరితో మాట్లాడినా 'శివోహం, శివోహం!' ఏమయ్యా! యెట్లా వున్నావు? అని ఎవరైనా అడిగితే 'శివోహం, శివోహం' అని జవాబు చెప్పేవాడు. ఈ విధముగా తాను మాటలనంతా వినియోగపెట్టేవాడు. ఒకసారి ఒక మిత్రుడు గట్టిగా నిలవేసి అడిగాడు, 'శివోహం అంటే యేమిటి? అర్థము చెప్ప'మన్నాడు. 'నేను శివుడను, నేను శివుడను' అని అర్థము చెప్పాడు. వెంటనే ఆ మిత్రుడు మరొక ప్రశ్న వేశాడు, 'నీవే శివుడైతే పార్వతీదేవి నీకేమి కావాలి?' అన్నాడు. 'అపరాధము! అపరాధము!' అని చెంపలు వేసుకున్నాడు ఈ వ్యక్తి. అనగా యేమిటి? 'నేనే శివుడు' అని వుచ్చరిస్తున్నాడు

srisathyasaivachanamrutam

కాని, ఆ శివభావం తనలోలేదు. నిజముగా వుండివుంటే 'పార్వతి నాపత్నియే' అని ధైర్యముగా చెప్పవచ్చుకదా! తాను శివుడైతే పార్వతి తన పత్ని యెందుకు కాకూడదు? పార్వతి అనగా శక్తి. శివుడనగా జడము. జడశక్తుల ఐక్యతయే శివపార్వతులు. ఈ ధైర్యమీనాడు లేదు. ఇలాంటి మంత్రములు యెంతకాలము పారాయణము చేసి యేమి ప్రయోజనము! కనుకనే మొట్టమొదట తానే దైవముగా భావించటానికి తగిన సాధనలు చెయ్యాలి. దైవము సర్వులయందు వున్నాడనే సత్యాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి.

ఉపాధి భేదములుండవచ్చు. చూడండి, యీ హాలులోని బల్బులయొక్క కాంతి, రూపము అనేక రకములుగా కనిపిస్తున్నాది. కానీ, ఈ బల్బులన్నిటియందు వున్నటువంటి కరెంటు ఒక్కటే! అదే విధముగనే మన దేహములంతాకూడను బల్బులవంటివి. ఇవి అనేక రూపనామములు ధరించవచ్చు. అనేక రంగులు వుండవచ్చు. వాటి రూపములు, శక్తులు వేర్వేరుగా వుండవచ్చును. కాని అందరియందు చేరిన ఆత్మతత్త్వము ఒక్కటే! ఈ సత్యాన్ని గుర్తించమనే యజుర్వేదము ప్రబోధిస్తూ వచ్చింది.

**ఎవరిని బాధించకుండా అందరిలోను దైవమున్నాడనే భావముతో సంచరించాలి**

కనుక, యజుర్వేదమంటే మనమన్నీ నేర్చుకొని వల్లె వేయనక్కరలేదు. అధ్యయనం చేయనక్కరలేదు. దాని సారమును గ్రోలి, మనకు అవసరంలేని దానిని విసర్జించినప్పుడే యీ సత్యాన్ని గ్రహించినవారవుతారు. మార్కెట్టుకి పోయి మనం మొసంబిపండు కొంటాము. ఈ మొసంబిపండును మనం కొన్నామే కాని దీనిని కోసి అందులోని రసమును మాత్రమే స్వీకరిస్తాము. దానితోలును, విత్తనములను పారవేస్తాము. డబ్బిచ్చి కొన్నామని తోలంతా తింటామా! అటులనే మనం విసర్జించవలసిన దుర్గుణములు విసర్జించాలి. స్వీకరించవలసిన సద్గుణములు ఆనందంగా స్వీకరించాలి. కానీ, యీనాడు కలి ప్రభావముచేత దుర్గుణములే స్వీకరిస్తున్నారు. సద్గుణములు విసర్జిస్తున్నారు. సత్సంగాన్ని విసర్జిస్తున్నారు, దుస్సంగాన్ని స్వీకరిస్తున్నారు. దుర్భావములు ప్రవేశ పెడుతున్నారు, సద్భావములనంతా వెనుకకు నెడుతున్నారు. ఇదియే నూతనమైన ఫాషన్‌గా భావిస్తున్నారు. ఇదికాదు. ఇది మహాపాపము. ముందుముందు దీనియొక్క ఫలితములనేకరకములుగా

అనుభవించవలసివస్తుంది. కనుక, యీ సత్యాన్ని గుర్తించి సాయీ సంస్థలలో ప్రవేశించి, తద్వారా యీ సేవయొక్క తత్త్వాన్ని పూర్తిగా అర్థం చేసుకొని, యెవరికి సేవచేసినా దైవానికే సేవ చేస్తున్నామనే సత్యాన్ని మీరు తెలుసుకోండి.

వేదములు ఒక్కొక్కటికూడను ఎవరికి వారు అనేకంగా తీసుకున్నప్పటికినీ, అన్నీ బోధించే సత్యము ఒక్కటే! వేదములకు నానార్థములెన్నియో వుంటున్నాయి. ఈ నానార్థములలోపల అనర్థమునే స్వీకరించి యథార్థమును విస్మరించటము సరైనదికాదు. సరైన అర్థమేమిటి? సర్వులయందు దైవము వున్నాడు. ఎవరినీ బాధించకుండా అందరియందు దైవత్వమున్నాడనే భావముతోనే నీవు సంచరించాలి.

**సాయి సంస్థవంటి స్వార్థరహిత సంస్థ జగత్తునందు ఎక్కడా లేదు**

ఇంక, రేపటి దినము సామవేదాన్ని గురించి తెలుసుకుందాము. వేదములలో వున్న సారమంతా ఒక్కటే! అయితే మీకు అర్థమయ్యే నిమిత్తమై యీ విధముగా బోధించవలసివస్తోంది. దివ్యాత్మస్వరూపులారా! మీరు గుర్తించవలసినది ఒక్కటే! సాయితత్త్వాన్ని మీరు చక్కగా అర్థం చేసుకోండి. ఏ విధమైన స్వార్థము లేదు. సాయీ సంస్థలలో ప్రవేశపెట్టిన పవిత్రత యే క్షణమునందుకూడను అపవిత్రంకానేరదు. ఇట్టి స్వార్థరహితమైన సంస్థ జగత్తునందు యెక్కడా లేదు, రాదు. ఈ సంస్థయందు చిన్న వస్తువులుకూడను దుర్వినియోగపరచటానికి యేమాత్రము అవకాశములేదు. ఏది చేసినా, యేది చూసినా, యేది చెప్పినా అన్నీ పవిత్రమైన మార్గములో ప్రవేశపెడుతూ వుంటాను. కానీ తెలియని మూర్ఖులు ఏదో నాకు స్వార్థం అనుకుంటారు. మనం అనేక కొత్త విద్యాసంస్థలనభివృద్ధి పరుస్తున్నాము. ఇది స్వార్థమా? ప్రపంచములో యెక్కడైనా యే విధమైన ఫీజులేకుండా విద్యనభ్యసించే అవకాశము వుంటుందా? మీరే చెప్పండి. ఈనాడు దేశంలో ఎక్కడైనా సరే, ప్రైమరీ స్కూలులోపల పిల్లలను ప్రవేశపెట్టామంటే పదివేలు, ఐదువేలు, ఎనిమిదివేలు సుంకము తీసుకొని వానికి సీటు యిస్తున్నారు. కాని, మన విద్యాసంస్థలందు 1వ తరగతి నుండి Ph.D వరకు మేము నయాపైసా ఫీజు పుచ్చుకోటంలేదు. ఇది నూటికి నూరు పాళ్ళు పరార్థమైన భావమే కాని స్వార్థ భావముకాదు.

srisathyasaivahini.org

కన్నులులేని గ్రుడ్డివారు దీనిని చక్కగా చూడలేకపోతున్నారు.

**కన్నులుండి గ్రుడ్డులై కళ్యాణకరమైన**
**యీ మూర్తి దర్శింపనేరరైరి**
**చెవులుండి చెవుటులై అతి మనోహరమైన**
**నా వాక్కు ఆలింప నేరరైరి**
**పాణిపంకజమందు పర్తీశుడున్నను**
**పాడు సంసారంబు కోరనేల**
**మిన్నంటుకాంతితో మేరు పర్వతముండ**
**వెండిబంగారుకై వెదుకుచుంద్రు**

నిజముగా యిది దురదృష్టము తప్ప మరొకటికాదు. ఈ సత్యాన్ని క్రమక్రమేణా మీరు గుర్తించండి. సాయి చేసే సర్వకార్యములు మీ నిమిత్తమే! స్వార్థములేదు కనుకనే సాయికి యే మాత్రము భయములేదు. స్వార్థములేదు కనుకనే సాయి నిరంతరము ఆనందముగానే వుంటాడు. ఇట్టి ఆనందమే నిజమైన దైవ స్వరూపము.

**నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం**
**ద్వంద్వాతీతం గగనసదృశం తత్వమస్యాదిలక్ష్యమ్**
**ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం**
**భావాతీతం త్రిగుణరహితం యీ రూపం**

ఇవన్నీ మీ నిమిత్తమై నేను ప్రవేశపెడుతున్నానేకాని, నాలో యేమాత్రము స్వార్థములేదు. నాలో యేమాత్రము విచారములేదు. ఈనాడు జగత్తునందు యీ విధమైన పవిత్రమైన, స్వార్థరహితమైన సేవలనాచరించటానికి ప్రయత్నించినప్పుడే ప్రపంచమంతయు సుఖశాంతులతో నిండుతుంది. దీనిని మీరు ఆదర్శంగా తీసుకొని దేశమంతా త్వరలోనే సరైన పరిస్థితిని అనుభవింప చేస్తారని, ఆనందిస్తారని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. **తేదీ 30-09-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam